# కౌంటింగ్ కేంద్రం కోసం కళాశాల పరిశీలన

**బండారి శ్రీనివాస్ కళాశాలను సందర్శించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

**పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఈఆర్‌వో, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలన**



పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లపై చర్చిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

షాబాద్, జనవరి 19: చేవెళ్ల మండలంలోని గొల్లపల్లిలోని శ్రీ బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలను రంగారెడ్డిజిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం చేవెళ్ల శ్రీ బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రతిపాదించిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఈఆర్‌ఓ, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి ఈ కళాశాలలో అనువుగా ఉన్న గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, వికారాబాద్, తాండూరు, పరిగి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండడంతో ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నది. పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు నిర్వహించాల్సి ఉన్నందున అందుకు అనుగుణంగా కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతపరమైన అంశాలను ఈ.ఆర్.ఓ, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలన జరిపారు. బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భవన్ సముదాయానికి సంబంధించిన బ్లూ ప్రింట్ మ్యాప్‌ను పరిశీలించి ప్రస్తుతం కౌంటింగ్ నిర్వహణకు ఏ మేరకు అనువైన పరిస్థితులు ఉన్నాయన్నది పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించేందుకు బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందా, లేదా అన్నది మరింత సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, డీసీపీ, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

## డిగ్రీ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

**ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేసిన కళాశాల అధ్యాపక బృందం**



ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 19 : ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లో నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ప్రభు అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కళాశాల అధ్యాపకబృందంతో నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పాత భవనంలో వసతుల లేమితో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవన నిర్మాణ పనులు పూర్తయినందున విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులోకి తేవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి రెండు నెలల్లో కళాశాల భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యాపకుడు నాగోజీ ఉన్నారు.

## సంఘంలో సభ్యత్వం పొందాలి

**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో దేవేందర్**



సభ్యత్వం కోసం దరఖాస్తు చేస్తున్న రైతు మహేశ్‌యాదవ్

ఆమనగల్లు, జనవరి 19: పట్టాదారు పాసు పుస్తకం కలిగిన రైతులందరూ వాటాధనం చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం పొందాలని సంఘం సీఈవో గోరటి దేవేందర్ తెలిపారు. పీఏసీఎస్‌లో రుణాలు పొందని రైతులు సైతం సభ్యులుగా చేరవచ్చన్నారు. రూ.300 వాటాధనం చెల్లించి, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, జిరాక్స్ పత్రాలు, రెండు పాసుఫొటోలు సమర్పించి సభ్యత్వం పొందాలని సూచించారు. ఈ సభ్యత్వం ఉన్నవారికి వ్యవసాయ ఉపయోగకర యంత్రాలు, ఎరువులు, విత్తనాలు రాయితీపై పొందే అవకాశం ఉందని సీఈవో గోరటి దేవేందర్ తెలిపారు.

## ఓటు నమోదుకు నేడు, రేపు ప్రత్యేక శిబిరాలు

**ఆర్డీవో వెంకటమాధవరావు**



షాద్‌నగర్‌టౌన్, జనవరి 19 : 2024 జనవరి 1వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఇందుకుగాను శని, ఆదివారాలు ప్రత్యేక ఓటు హక్కు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ పార్థసారథితో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఏమైనా మార్పులు, తప్పులు ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా ఒక ఓటరు రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉండకూడదన్నారు. ఎవరికైనా రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే వెంటనే ఫాం-7ద్వారా దరఖాస్తు చేసుకుని ఏ చోట ఓటు హక్కు అవసరమో చూసుకోవాలన్నారు. నియోజవకర్గ వ్యాప్తంగా 252 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఇందులో పురుషులు 1,19, 698 మంది, స్త్రీలు 118,233మంది, థర్డ్ జెండర్ 14మంది మొత్తం 2,37,945మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వాడివేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 19 : పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినా మండల అధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ సర్పంచులు, కార్యదర్శులు ఎంతో శ్రమించి గ్రామాలకు కొత్తకళ తీసుకువచ్చారని, గ్రామాల అభివృద్ధి, వీరి పని తీరు అద్భుతమని కొనియాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గ్రామాల్లో పచ్చదనం కనిపిస్తుందన్నారు. మోకిల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా చేయడానికి పైరవీలు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినా ప్రజల తరపున పోరాడాలని నాయకులకు పిలుపునిచ్చారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ మిర్జాగూడ నుంచి ఇంద్రారెడ్డినగర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపనులు మధ్యలో ఆపేశారని ఆరోపించారు. మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లోని ఫేజ్ 1, ఫేజ్ 2లలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సభలో తెలియపరిచారు. ఇంద్రారెడ్డినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని అన్నారు. కరెంట్ కొరత లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ప్రొద్దటూర్ సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే గుడ్లు నాసిరకంగా ఉన్నాయని సభలో ప్రస్తావించారు. ప్రొద్దటూర్‌లో అంగన్‌వాడీల కొరత ఉందని, మండల విద్యాధికారి చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. టంగటూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ గోపాల్ తెలిపారు. సర్పంచులకు విడుదల కావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మహరాజ్‌పేట్ సర్పంచ్ నర్సింహారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. గ్రామంలో రోడ్డు పనుల నిమిత్తం మట్టి తవ్వకాలు జరిపితే అధికారులు నిలిపివేయడమేంటని, మండలంలో మట్టిని వ్యాపారంగా మార్చారని గాజులగూడ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో జడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య, ఎంఈవో అక్బర్, సర్పంచులు అశ్విని, లలిత, పావని, ఎంపీటీసీలు సరితారాజునాయక్, ప్రవళిక వెంకట్‌రెడ్డి, మేఘన, నాగేందర్, యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో ప్రజల అవసరాలు గుర్తించాలి

**నందిగామ ఏపీఎం యాదగిరి**

నందిగామ, జనవరి 19 : నందిగామ మండల కేంద్రంలో ఏపీఎం యాదగిరి శుక్రవారం గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రణాళికపై మహిళా సమాఖ్య సభ్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూళన, ప్రజల అవసరాలపై ప్రణాళిక రూపొందించేందుకు సమాఖ్య సభ్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు, స్థితిగతులు, ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన పథకాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం యాదగిరి

## దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

కడ్తాల్, జనవరి 19: రాష్ట్ర వీరశైవ లింగాయత్- లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షుడు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా మంత్రు లు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య హాజరుకానున్నారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో జిల్లాలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మరమ్మతుల దృష్ట్యా నిలిపివేత**

పెద్దఅంబర్‌పేట, జనవరి 19: మున్సిపాలిటీ పరిధి హనుమాన్‌నగర్, లక్ష్మీగణపతి కాలనీ, సూర్యమెడోస్, రాఘవేంద్రకాలనీ, ఆర్ఎన్ఆర్ ఫేస్ 1, 2, జీవీఆర్ కాలనీ, జ్యోతిపురం, పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాలు, తిరుమల రెసిడెన్సీ, తట్టిఅన్నారం, తట్టిఖానా, వనస్థలి హిల్స్, మర్రిపల్లితో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. విద్యుత్ తీగలకు సమీపంలోని చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున వినియోగదారులు సహకరించాలని ఏఈ చంద్రమౌళి కోరారు.

**చేవెళ్ల మండలంలో..**

చేవెళ్ల రూరల్ : నేడు చేవెళ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ జాని మోహినుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దేవుని ఎర్రవల్లి, ఊరేళ్ల, గొల్లపల్లి, కొత్తపల్లి, చన్‌వెళ్లి, బస్తేపూర్, ఖానాపూర్, ఆలూర్, కౌకుంట్ల, అంతారం, దుద్దాగు, దేవరాంపల్లి, నాంచేర్ తదితర గ్రామాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**యాచారం మండలంలో..**

యాచారం, జనవరి19 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేతలో భాగంగా యాచారం, మొగుళ్లవంపు, తక్కళ్లపల్లి, నక్కగుట్టతండా గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. యాచారం, మొగుళ్లవంపు గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, తక్కళ్లపల్లి, నక్కగుట్ట గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు, రైతులు, ఇండస్ట్రియల్‌కు చెందిన వారు సహకరించాలని కోరారు.

## రోడ్డు పనుల్లో వివాదం

**నక్షబాట నుంచే చేపట్టాలని ఆందోళన**

**కోర్టు ఉత్తర్వుల మేరకు పనులు చేపడుతాం**

**ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్‌ప్రకాశ్**

తుర్కయాంజాల్, జనవరి 19 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సాగర్ రహదారి ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులో నిలిచిన పనులను అధికారులు తిరిగి చేపడుతుండగా వివాదం చోటు చేసుకుంది. ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ఇంజాపూర్‌కు చెందిన బొక్క గోపాల్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయాయి. గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటుగా మరో పట్టాదారు తమకు చెందిన వ్యవసాయ భూమి నుంచి రోడ్డును వేయకుండా అడ్డుకోవాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే ఇటీవల కోర్టు ప్రస్తుతం వాడుకలో ఉన్న రోడ్డు పనులను 7 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయాలని ఉత్తర్వులను జారీ చేయగా, శుక్రవారం అధికారులు రోడ్డు పనులను చేపడుతుండగా గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు నక్షబాటలో రోడ్డు వేయకుండా తమకు చెందిన స్థలంలోనే అధికారులు రోడ్డు పనులను చేపట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. గోపాల్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ మహిళ తమ వ్యవసాయ భూమి నుంచి రోడ్డు పనులను చేపడితే ఆత్మహత్య చేసుకుంటానని కిరోసిన్ మీద పోసుకోగా, పోలీసులు ఆమెను అడ్డుకొని గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అధికారులు రోడ్డు పనులను చేపట్టడానికి మరోమారు ప్రయత్నించగా, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం నక్షబాట ప్రకారం రోడ్డు వేయాలని అధికారులను కోరారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టాదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి వాగ్వాదానికి దిగిన వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్‌ప్రకాశ్ మాట్లాడుతూ కోర్టు ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే రహదారిలో 300 మీటర్లకు సంబంధించిన స్థలంలో వివాదం చోటు చేసుకుంటుందని అన్నారు. ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించారని కోర్టు ఉత్తర్వుల ప్రకారం 7 మీటర్ల వెడల్పుతో ప్రస్తుతం వాడుకలో రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించిన అనంతరం నక్షబాటలో సైతం రోడ్డు పనులను చేపడుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు, రెవెన్యూ సిబ్బంది, వనస్థలిపురం పోలీసులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు



మహిళను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## భజన బృందం సభ్యులకు స్వెటర్లు అందజేత

కడ్తాల్, జనవరి 19: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని ప్రముఖ వ్యాపారవేత్త మిర్యాణం సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భక్త భజన బృందం సభ్యులకు, మిర్యాణం సాంబయ్య కుమారులు వెంకటేశ్, శ్రీనివాస్ సమకూర్చిన రూ.10వేల విలువగల స్వెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో అర్చకుడు తిరునగరి శ్రీధర్, నేతి ప్రభులింగం, భజన బృందం సభ్యులు శ్రీకాంత్, బాబు, శ్రీనివాస్, శ్రీశాంత్, లక్ష్మయ్య, మంజునాథ్, నారాయణ, శ్రీనివాసాచారి, సాయిరాం పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కడ్తాల్, జవనరి 19: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షుడు యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్ యూటీఎఫ్-2024 క్యాలెండర్‌ని ఎంఈవో సర్దార్‌నాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అరుణ, ఏఎన్‌వో జంగయ్యతో కలిసి యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఉపాధ్యక్షులు జంగయ్య, కౌసల్య, కోశాధికారి విజయ్‌కుమార్, నాయకులు జహంగీర్, క్రాంతికుమార్, సునీత, హేమలత, ఉపాధ్యాయులు ధనుంజయ్య, రాధాకృష్ణారెడ్డి, ప్రవీణ్, రవీందర్ పాల్గొన్నారు.






గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ జానకి, ఆర్ఐ రాంబాబు

## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు?

**గాలింపు చర్యలను పర్యవేక్షించిన తహసీల్దార్ జానకి, ఆర్ఐ రాంబాబు**

కొత్తూరు, జనవరి 19: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడలో జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు వివరాల ప్రకారం కుమ్మరిగూడకు చెందిన మైలారం ఈశ్వరయ్య గురువారం అర్ధరాత్రి పశువులకు మేత వేయడానికి వెళ్లాడు. పక్కనే ఉన్న గోధుమకుంట చెరువులో చేపలకు వేటకు వెళ్తుంటాడు. గురువారం రాత్రి కూడా చేపల వేటకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు చెప్పారు. కుటుంబ సభ్యుల సమాచారం అందించడంతో శుక్రవారం ఎన్‌ఆర్ఎఫ్ బృందాలు గాలింపు ప్రారంభించాయి. సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఈశ్వరయ్యకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. గాలింపు చర్యలను కొత్తూరు తహసీల్దార్ జానకి, ఆర్ఐ రాంబాబు పర్యవేక్షించారు.

## శ్రీరాముడి అక్షింతలకు పూజలు

షాబాద్, జనవరి 19: షాబాద్ మండలంలోని సంకెపల్లిగూడ గ్రామంలో శ్రీరాముడి అక్షింతలకు ఘనంగా పూజలు చేశారు. శుక్రవారం సంకెపల్లిగూడ గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఊరేగించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి దర్శన్, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ మల్లాపురం రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు వెంకటయ్య, రఘుగౌడ్, రవిగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం సరికాదు



శంకర్‌పల్లి, జనవరి 19 : సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు రాజూనాయక్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొండకల్ గ్రామంలోని 184, 181 సర్వే నంబర్‌లలో 16 గుంటల భూమిని గోపాల్, సుధాకర్, నర్సింహ దగ్గర నుంచి కొనుగోలు చేశామని, వారే కంచె వేసి ఇచ్చారని అన్నారు. గురువారం తాను కొనుగోలు చేసిన పొలాన్ని చదును చేస్తుండగా, కొందరు వ్యక్తులు భూమి కబ్జా చేస్తున్నామని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తన వైపు తప్పు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

## గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి**

షాబాద్, జనవరి 19: గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో రూ.10లక్షల ఎంపీ నిధులతో ముస్లింల శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలన్నీ అభివృద్ధి చెందిన్నట్లు తెలిపారు. కేసీఆర్ పాలనలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పీసరి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

## పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 19 : రైతులు సాగుచేసుకున్న పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. యాసంగిలో రైతులు సాగుచేసుకుంటున్న పంటల వివరాలు గ్రామాల్లోకి వచ్చే వ్యవసాయశాఖ అధికారులకు సహకరించి తమ పొలాల్లో సాగుచేసుకున్న పంటల వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పోల్కంపల్లి, నాగన్‌పల్లి, నెర్రపల్లితో పాటు పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏఈవో శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పంటల నమోదు వివరాలపై ఆయన ఆరా తీశారు. పంటల వివరాలు నమోదు కోసం గ్రామాల్లోకి వచ్చే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.



పోల్కంపల్లిలో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో శ్రవణ్‌కుమార్